క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణ



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలోని పద్మావతి కళ్యాణ వేదికపై భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు, దేవాలయ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమంజరిగింది. డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి సత్సంగ బృందం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్. మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్నను సత్కరించారు.

మాల ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలి



నెహ్రూనగర్: రాష్ట్రంలోని మాల ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబటి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. పాత గుంటూరులోని గంగానమ్మ కమ్యూనిటీ హాల్ వద్ద శనివారం మాల ఉద్యోగుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మాల ఉద్యోగుల సంఘాన్ని పటిష్టం చేసుకుంటూ శక్తివంతమైన వ్యవస్థగా ఏర్పడాలని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి మూర్తి, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం మాట్లాడుతూ మాల సమాజానికి జరుగుతున్న అన్యాయాలపై చైతన్యం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం జిల్లా, నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చుక్కా రాజు, జిల్లా కార్యదర్శిగా ప్రకాష్, కోశాధికారిగా డేవిడ్ రాజు, ఉపాధ్యక్షుడిగా పాల్ ప్రదీప్, జాయింట్ సెక్రటరీగా నేలపాటి క్రాంతి, నగర అధ్యక్షుడిగా కె. నాగేశ్వరరావు, సెక్రటరీగా దేవరపల్లి రత్నరాజు, ట్రెజరర్‌గా జి. శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్ రాజు, జయకర్, జాయింట్ సెక్రటరీగా దీపక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



గుంటూరు మెడికల్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ విజయం సాధించిన సందర్భంగా జిల్లా కార్యాలయంలో నేతలు సంబరాలు జరుపుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉండి అభివృద్ధి, మౌలిక వసతులను కల్పించక పోవడం వల్ల ప్రజల ఆగ్రహానికి గురైందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం గురించి పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై నమ్మకంతో డబల్ ఇంజన్ సర్కార్ కోసం ఢిల్లీ ప్రజలు కమలంపై ఓటేసి బీజేపీని గెలిపించుకున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు యడ్లపాటి స్వరూపరాణి, కొత్తూరు వెంకట సుబ్బారావు, పాలపాటి రవికుమార్, కొక్కెర శ్రీనివాస్, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార కట్టడాలపై పటిష్ట పర్యవేక్షణ

నెహ్రూనగర్: నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా అనధికార కట్టడాలు నిర్మాణం జరగకుండా ప్లానింగ్ కార్యదర్శులు పటిష్టంగా పర్యవేక్షణ చేయాలని, నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం ఆయన రోజువారీ పర్యటనలో భాగంగా వికాస్ నగర్, ఎస్‌వీఎన్ కాలనీ, కొరిటిపాడు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనధికార కట్టడాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ కార్యదర్శులు, టీపీబీఓలు పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో ప్రతి నిర్మాణం నిబంధనల మేరకే జరగాలని చెప్పారు. నిర్మాణం జరిగిన ప్రతి భవనానికి ఆస్తి పన్ను విధించేలా అడ్మిన్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. బహుళ అంతస్తు భవనాలకు ఓసీ వచ్చే వరకు వేచి ఉండకుండా నివాసం ఉండే ఫ్లాట్‌లకు పన్ను విధించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనల్లో అండర్ అసెస్‌మెంట్లు, అన్ అసెస్‌మెంట్లు గుర్తిస్తే సంబంధిత అడ్మిన్ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఈ రమేష్ బాబు, ఆర్వో మదన్ గోపాల్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఈపీఎఫ్ తలనొప్పి

- డాక్యుమెంట్లు ఇచ్చినా మళ్లీ ఇవ్వాలంటూ పదే పదే మెసేజ్‌లు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పారిశుద్ధ్య కార్మికులు
- పట్టించుకోని నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు



నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పత్రాలు ఇచ్చేందుకు క్యూ కట్టిన పారిశుద్ధ్య కార్మికులు

నెహ్రూనగర్: గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ఈపీఎఫ్ (ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్) కష్టాలు తలనొప్పి తెప్పిస్తున్నాయి. ఆధార్, పాన్, ఓటర్, రేషన్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్, ఇతర పత్రాలు సమర్పించినప్పటికీ తిరిగి ఇవ్వాలంటూ మెసేజ్‌లు రావడంతో ఆందోళన చెందుతున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల దాకా విధులు నిర్వహించి, తిరిగి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పత్రాలను ఇచ్చేందుకు అవస్థలు పడుతున్నారు.

647 మందికి మెసేజ్‌లు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రెండు వేల మంది దాకా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఈపీఎఫ్ ప్రతి నెలా కట్ అవుతోంది.ఇప్పటికే అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ తిరిగి ఇవ్వాలంటూ 647 మందికి మెసేజ్‌లు రావడంతో అటు పీఎఫ్ కార్యాలయం చుట్టూ(బృందావన్ గార్డెన్స్), ఇటు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీఎఫ్ కౌంటర్ వద్ద పడిగాపులు పడుతున్నారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లేదా పాస్‌పోర్ట్ తప్పనిసరి నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు చాలా మందికి చదువు అంతంత మాత్రంగానే ఉంటుంది. అయితే, అధికారులు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లేదా పాస్‌పోర్ట్ అడుగుతున్నారు. ఇప్పటికప్పుడు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తేవడానికి కార్మికులు నరకయాతన పడుతున్నారు. పాస్‌పోర్ట్ కోసం వేల రూపాయలను డిమాండ్ చేయడంతో అప్పులు చేసి మరీ తెప్పించుకుంటున్నారు.

డబ్బులు ముట్టజెప్పితే సరే...

ఈపీఎఫ్ ఖాతాలో పేర్లు తప్పులు పడటం, భర్త/భార్య/తండ్రి/తల్లి పేర్లలో తప్పులు దొర్లడం..పుట్టిన తేదీలో తప్పులు వంటివి తరుచుగా పారిశుద్ధ్య కార్మికులను వేధించే ప్రధాన సమస్యలు. వీటి పరిష్కారానికి ప్రత్యేక క్యాంపులు పెట్టినప్పటికీ సమస్యకు మాత్రం పరిష్కారం దొరకడం లేదు. కొంత మంది సిబ్బంది కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక లేక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉండే పీఎఫ్ సిబ్బందికి(కాంట్రాక్ట్ ఏజెన్సీకి) డబ్బులు ముట్టచెప్పి పనిచేయించుకుంటున్నారు. కొంత మంది వారు అడిగింది ఇచ్చుకోలేక, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు నసీర్, మాధవితో కూటమి కార్పొరేటర్లు

కూటమి మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర?

నెహ్రూనగర్ : నగరపాలక సంస్థ కూటమి మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర(నాని)ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రతిపాదించారు. గుంటూరు నగరంలో టీడీపీ, జనసేనకు చెందిన కార్పొరేటర్లు శనివారం సమావేశమయ్యారు. ఇటీవల స్థాయి సంఘానికి ఎన్నికైన సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి కూడా పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన కోవెలమూడి రవీంద్ర (నాని)ని రాబోయే కాలంలో మేయర్ అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. మంత్రి లోకేష్ దృష్టిలో కూడా ఈ అంశం ఉందన్నారు. అయితే, ముందుగా ఎవరితో చర్చించకుండా ఈ ప్రకటన చేయడంతో పశ్చిమ ఎమ్మెల్యే మాధవితో పాటు పలువురు కార్పొరేటర్లు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. మరి కొద్ది రోజుల్లో ప్రస్తుత నగర మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధం అవుతోంది. నగరపాలక సంస్థ పాలకవర్గంలో అత్యధిక మెజారిటీ ఉన్న వైఎస్సార్ సీపీ సభ్యులను టీడీపీ ఎమ్మెల్యేలు ప్రలోభ పెట్టారు. ఎలాగైనా స్థాయి సంఘాన్ని దక్కించుకునేందుకు వారందరినీ తమ పార్టీలోకి ఆహ్వానించిన విషయం తెలిసిందే.

సీఎం హామీని నిలబెట్టుకోవాలి

లక్ష్మీపురం: వెల్ఫేర్ సెంటర్‌లో హాస్పిటల్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని కోరుతూ శనివారం వెల్ఫేర్ సెంటర్ వద్ద సీపీఐ నాయకులు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర నడిబొడ్డులో గల 14 ఎకరాల కార్మిక శాఖ స్థలంలో కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణను ఇచ్చేవారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. వెల్ఫేర్ సెంటర్‌ను పరిశుభ్రం చేసి హాస్పిటల్ నిర్మించాలని, మిగిలిన స్థలాన్ని వాకింగ్ ట్రాక్‌గా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నాయకులు విరిగినేని వెంకటేశ్వరరావు, స్థానికులు మేడసాని కేశవ, కల్లూరి చిన్న తిరుపతిరావు, దూదిపల్లి శ్రీనివాసరావు, మాదాల కమలాకర్, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, దిలీప్, రమణ పాల్గొన్నారు

ఆప్కాస్ రద్దు ఆలోచనతో ఉద్యోగులకు తీవ్ర నష్టం

లక్ష్మీపురం: కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు, జీతాల చెల్లింపు ప్రక్రియను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ బి. లక్ష్మణరావు, సెక్రటరీ జనరల్ బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరో తేదీన జరిగిన మంత్రివర్గంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తూ పాత పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని నిర్ణయం చేసినట్టు కొన్ని పత్రికల్లో వచ్చాయని తెలిపారు. ఇది సరైనది కాదని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న 2,50,000 కాంట్రాక్ట్ ,అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆచరణాత్మక కృషితో గొప్ప విజయాలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- ప్రముఖ వైద్య నిపుణుడు రవికాంత్ కొంగర
- భాష్యంలో ముగిసిన కల్చరల్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులతో భాష్యం హనుమంతరావు, సాకేత్‌రామ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆలోచనలకు ఆచరణాత్మక కృషి తోడైతే జీవితంలో గొప్ప విజయాలు సాధిస్తారని ప్రముఖ వైద్య నిపుణుడు రవికాంత్ కొంగర అన్నారు. సాయిబాబా రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో 'బ్లూమ్స్ హూప్లా' పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన కల్చరల్ డే శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ నేడు సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై తీవ్రంగా ఉంటోందని తెలిపారు. ఏది మంచి, ఏది చెడో అనే విచక్షణతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ విజయవంతులైన ప్రతి విద్యార్థి వెనుక భాష్యం ఉంటుందన్నారు. తనకు చదువు నేర్పిన గురువులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ ఒకనాటి భాష్యం విద్యార్థులే సంస్థల బాధ్యత చేపట్టి ముందుకు నడిపించడం ఎంతో అభినందనీయమన్నారు. భాష్యం విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ భాష్యం విద్యా సంస్థలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడి, తిరిగి ఆ సంస్థకే అతిథులుగా రావడం సంతోషకరమని తెలిపారు. తొలుత అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన ప్రారంభమైంది. సభకు భాష్యం మెడెక్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. అనంతరం అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి హరికృష్ణ తండ్రి జోగేశ్వరరావును భాష్యం హనుమంతరావు సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రైమరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత, సెకండరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ గిరిజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని భాష్యం బ్లూమ్స్ జెడ్ ఈఓ వరలక్ష్మి పర్యవేక్షించారు.

హవ్వ.. కూటమి ప్రభుత్వానికి ర్యాంకులా ?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి

పట్నంబజారు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేకపోయినా...వారికి వారే ర్యాంకులు ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అప్పటి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి అమలు చేసిన ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు. అమాయకులను అరెస్ట్ చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నందుకు ప్రథమ స్థానం.. పూర్తిగా క్షీణించిన పర్యటానికి రెండో స్థానం.. ఇంత వరకు ఏ ఒక్క పరిశ్రమ పెట్టని శాఖకు మూడో స్థానంతో పాటు వివిధ శాఖలకు ర్యాంకులు కేటాయించటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఆరు, లోకేష్ ఎనిమిది, పవన్ కల్యాణ్‌కు 10 స్థానాలు కేటాయించుకున్నారంటే.. వారెంత వెనుకబడి ఉన్నారో.. వారే ఒప్పుకుంటున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయనందుకు చంద్రబాబుకు ఆరో ర్యాంకు ఎందుకు వచ్చిందో చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. ఏ మాత్రం సిగ్గు ఉన్నా.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో కచ్చితంగా ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాబోయే రోజుల్లో వైఎస్ జగనన్న-2 చూడటం తథ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు సర్కార్‌కు సొంత డప్పు కొట్టుకోవటం కొత్తేమి కాదని ఎద్దేవా చేశారు.

ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ, అవగాహన అవసరమని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో ఆదిత్య బిర్లా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ (ఎన్ఐఎస్ఎం) ఆధ్వర్యంలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఆర్థిక పరిజ్ఞానంపై రెండు రోజుల పాటు నిర్వహించిన సర్టిఫికెట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థల్లో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. అనంతరం వ్యక్తిగత ఫైనాన్స్, ఆర్థిక అక్షరాస్యత, బడ్జెట్, పెట్టుబడి, పొదుపు, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అనేక రకాల ఫైనాన్షియల్ సెక్యూరిటీ మార్కెట్ అంశాలపై ఆదిత్య బిర్లా, ఎన్ఐఎస్ఎం రీసోర్స్ పర్సన్ విజయకుమార్ శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఎం. అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతిరాత నైపుణ్యంతో అందమైన భవిష్యత్తు



విద్యార్థులతో ఖాసిం, ఉప్పాల రామమోహనరావు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాత నైపుణ్యంతో అందమైన భవిష్యత్తు సొంతం చేసుకోవచ్చని ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్యాలిగ్రఫీ టీం ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చేతిరాత పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖాసిం మాట్లాడుతూ చేతిరాత నైపుణ్యంలో మెళకువలను అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని సూచించారు. క్యాలిగ్రఫీ టీం వ్యవస్థాపకుడు ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శిక్షణను సద్వినియోగం చేసుకుని, చేతిరాతను అందంగా మలచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో మరింతగా రాణించాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మహిళా కానిస్టేబుల్‌కు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎస్పీ

నగరంపాలెం: జిల్లాలోని కానిస్టేబుళ్లు విధుల్లో మరింతగా రాణించేందుకు, వారిలో నైపుణ్యాలు పెంపొందించడమే మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఉమేష్ చంద్ర హాల్‌లో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (హెచ్ఆర్‌డీ సెంటర్)లో శిక్షణ పూర్తయిన తొలి బ్యాచ్ కానిస్టేబుళ్లకు ధ్రువీకరణ పత్రాలను శనివారం జిల్లా ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే హెచ్ఆర్‌డీ కేంద్రాన్ని ప్రారంభించామని, మొదటి బ్యాచ్ కింద జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల (పీఎస్) నుంచి ముప్పై మంది కానిస్టేబుళ్లకు తర్ఫీదు ఇప్పించామని తెలిపారు. ఆరు రోజులపాటు కంప్యూటర్ శిక్షణ, ఆంగ్ల భాషలో నైపుణ్యతపై నిష్ణాతుడైన అధ్యాపకునితో తర్ఫీదు పొందారని పేర్కొన్నారు. పీఎస్‌లలో ఫిర్యాదులు రాయడం మొదలుకుని రఫ్ స్కెచ్, ఆధారాల సేకరణ, సాక్షుల వాంగ్మూలాలు నమోదు, చార్జిషీటు తయారీ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కేసుల్లో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, నేరస్తులకు శిక్షలు వేయించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పలు అంశాలపై తర్ఫీదు ఇచ్చిన సాయిబాబా, హెడ్ కానిస్టేబుళ్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, కిశోర్, కానిస్టేబుల్ శ్రీనివాస్, జిల్లా ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషాను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకుడు సాయిబాబా, నరేష్‌కుమార్ (పీసీఆర్), నాగమల్లేశ్వరరావు (డీసీఆర్‌బీ) పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన

పీఆర్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. రత్నకుమార్



మాట్లాడుతున్న రత్నకుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. రత్నకుమార్ డిమాండ్ చేశారు. జెడ్పీ ప్రాంగణంలోని సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి స్పందన లేనిపక్షంలో భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతామని తెలిపారు. సీనియార్టీ జాబితాలను అప్‌డేట్ చేయలేదని, యూనిఫాం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఖాళీ అయిన ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఉద్యోగోన్నతుల ప్రక్రియ జాప్యం జరుగుతున్న నేపథ్యంలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎన్. రాజేష్, ప్రభు కుమార్, కో-ఆప్టెడ్ సభ్యుడు ఎస్. శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బీఆర్ అంబేడ్కర్, కోశాధికారి షేక్ పెదబాబు, సుభాని పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ స్థాపనకు కృషి చేయాలి



ఎంపీకి వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సెలర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని స్థాపించేందుకు చర్యలు తీసుకోవాలని గుంటూరు ప్రాంతీయ అధ్యయన కేంద్ర ప్రతినిధులు, విద్యార్థులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఉద్యోగులకు జనవరి నుంచి నిలిచిన వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పార్ట్‌టైం ఉద్యోగులకు ఎనిమిది నెలల వేతన బకాయిలను చెల్లించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో గుంటూరు ప్రాంతీయ సమన్వయకర్త పి. గోపీచంద్, కౌన్సెలర్లు, సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ కాసరనేని కళా సమితి నాటకోత్సవాలు ప్రారంభం

ఆకట్టుకున్న దేవుడు కనిపించాడు నాటిక



దేవుడు కనిపించాడు నాటికలో సన్నివేశం



ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు పురస్కారం అందజేత

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై రెండు రోజులపాటు జరగనున్న డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి 13వ నాటకోత్సవాలు కె.ఆర్.కె.ఈవెంట్స్ నిర్వహణలో శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. కళా సమితి చైర్మన్ డాక్టర్ యర్రా నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ కాసరనేని సదాశివరావు ఆత్మీయ పురస్కారాన్ని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు అందించి, సత్కరించారు. అనంతరం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. శ్రీసాయి కార్తిక్ క్రియేషన్స్ (కాకినాడ) ఆధ్వర్యంలో మార్కొండ దుర్గాప్రసాద్ రచించగా, చిత్రా విజయలక్ష్మీ మహేష్ దర్శకత్వం వహించిన 'దేవుడు కనిపించాడు' నాటిక ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, డాక్టర్ పాతూరి కిరణ్ చౌదరి, ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఘంటా పున్నారావు, పొన్నూరు కళా పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు, కళా సమితి సభ్యుడు యర్రా ఈశ్వరరావు, సంస్థ కన్వీనర్ కట్రగడ్డ రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

'డొక్కా'ది గోడ మీద పిల్లి నైజం



మాట్లాడుతున్న మండపాటి

పట్నంబజారు : గోడ మీద పిల్లిలా మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ వ్యవహరించడాన్ని చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు విమర్శించారు. దళిత సామాజికవర్గమంతా డొక్కా వ్యవహారశైలి చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గుంటూరులోని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేసే అర్హత డొక్కాకు లేదని తెలిపారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా ? అన్న చంద్రబాబు పంచన చేరిన ఆయన వైఎస్. జగన్ గురించి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, లీగల్ విభాగం నేతలు పాల్గొన్నారు.